విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 14 నవంబరు 2025 8 పేజీలు

సమస్యల వలయంలో బాలలు

నేటి బాలలే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి వారి చేతులలోనే ఉంది. భారత రాజ్యాంగం ప్రతి చిన్నారికి విద్య, రక్షణ,ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవనానికి హక్కు కల్పిస్తుంది. ఈ హక్కులను రక్షించేందు కు భారత ప్రభుత్వం అనేక చట్టాలు చేసింది. కానీ అవగాహన సరిగా లేక చట్టాలు పుస్తకాలకే పరి మితం అవుతున్నాయి. ఆచరణలో నిలిపి చట్టాల అమలు ద్వారా చిన్నారులకు రక్షణ కల్పించి, వారికి విద్య, ఆరోగ్యం అందించడం సమాజం లోని ప్రతి ఒక్కరి బాధ్యత.

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : ప్రపంచ వ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని నవంబర్ 20న జరిపేవారు. ఎందుకంటే ఐక్యరాజ్యసమితి నవంబర్ 20ని అంతర్జాతీయ బాలల దినోత్స వంగా ప్రకటించింది. అందువల్ల భారత్ కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. అయితే... నెహ్రూ మరణం తర్వాత పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించి భారతీయులు నవంబర్ 14ను జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐక్యరాజ్యసమితి ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు చేశాయి. పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకు ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ బాలల దినోత్సవానికి రూపకల్పన చేసింది. ప్రపంచమంతటా బాలల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకోసం పలు చర్యలు చేపట్టడం ఈ దినోత్సవం లక్ష్యం.

అంతరిక్ష తారగా మారిన విద్య....

ఎన్నో రాజకీయ పార్టీలు,నాయకులు స్వాతంత్ర భారతంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. కానీ పేదరికపు చావులు,బాల కార్మిక వ్యవస్థలు ఇంకా ఉన్నాయి.అంతర్జాతీయ స్థాయిలో అందరికీ సమాన విద్యా అవకాశాలు అందడం లేదు. చాలావరకు సామాన్య ప్రజలు మొదలుకొని రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ▶మిగతా 2లో..

సహకార సంఘాలు బలోపేతం కావాలి

■ కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే 72వ అఖిలభారత సహకార వారోత్సవాల ప్రచార గోడపత్రికను గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులు పాటు సహకార శాఖ ఆధ్వర్యంలో వివిధ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సన్న, చిన్న కారు రైతులకు అందుబాటులో ఉంటూ జిల్లా కేంద్రం సహకార బ్యాంకు, సహకార సంఘాలు విస్తృత సేవలు అందించాలన్నారు. రైతులు, సభ్యులు అవసరాలను గుర్తించి సకాలంలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆత్మ నిర్భర్ భారత సాధకులుగా సహకార సంఘాలు పనిచేయాలన్నారు. సహకార సంఘాల నిర్వహణ సామర్థ్యం, జవాబుదారితనం, పారదర్శకత పెంపొందించుటకై కంప్యూటరీకరణ అమలు చేయాలని సూచించారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి కె.మురళీకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రర్లు ఈ.పూర్ణచంద్రరావు, ఐ.హుస్సేన్, ఎస్, శ్రీనివాసరావు జి.సత్యనారాయణ, సీనియర్ ఇన్స్పెక్టర్ డి.శేషుబాబు, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పద్ధతులను ప్రోత్సహించాలి

■ 15న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ■ కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం పరిశుభ్రత, ప్రజా పరిశుభ్రత, పౌరుల భాగస్వామ్యం విలువలను ప్రోత్సహించడానికి ప్రతి నెల మూడవ శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, మున్సిపల్ కార్యాలయాల్లోను, సంస్థలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఈ నవంబర్ 2025 నెల మూడో శనివారం "వ్యక్తిగత ఘ సమాజ పరిశుభ్రత" అనే ఇతివృత్తంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ క్యాలయాల్లో నవంబర్ 15న స్వచ్ఛంద దినోత్సవం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బహిరంగ మలవిసర్జన, మూత్ర విసర్జన నిర్మూలనపై దృష్టి సారించి, సమాజ శ్రేయస్సు కోసం మంచి పారిశుద్ధ్య పద్ధతులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడానికి విద్యాసంస్థలు, పాఠశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాలలో వాష్ (వాటర్ శానిటేషన్ ఘ హైజీన్) కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో బహిరంగ మూత్ర విసర్జన, మల విసర్జనను నిరోధించడానికి ప్రచారం చేపట్టాలని సూచించారు. పరిశుభ్రత నిర్వహణ, సురక్షితమైన పారిశుద్ధ్య పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల చుట్టూ శుభ్రపరిచే డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్యం విస్తరించడానికి మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లలో కొత్త కమ్యూనిటీ, ▶మిగతా 2లో..

ప్రకటనలు అమోఘం... పని శూన్యం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమహేంద్రవరం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతున్నామని, ఈ నగరాన్ని రాష్ట్రంలోనే క్లీన్ సిటీగా మార్చేస్తున్నామని గొప్పలు చెప్పు కుంటున్న నగర ప్రజా ప్రతినిధులు, నగర కార్పొరే షన్ అధికారులకు ఆ విషయంలో చిత్తశుద్ధి లోపించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి రాజమండ్రి నగరంలో కనిపిస్తున్న చెత్తగుట్టలు, అశుభ్రమైన పరిసరాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. నగరంలో ఇటీవల ఎక్కడ చూసినా చెత్త గుట్టలు, పిచ్చిమొక్కలు, దుర్గంధపూ రితమైన పరిసరాలే దర్శనమిస్తున్నాయి. ఎక్కడ ఏ మూల చూసినా అపరిశుభ్రమైన వాతావరణమే కానవస్తుంది. దీని వల్ల దోమలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్య బారిన పడే పరిస్థితులున్నా పట్టించుకునే నాథుడు లేడని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కొత్తగా వచ్చిన నగర కమిషనర్ ప్రతి రోజూ చాలా ప్రాంతాలను పరిశీలిస్తూ, రోడ్ల మీద అడ్డంగా వేసిన చెత్తాచెదారాలను వెంటనే శుభ్రం చేయాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేసే వారిపై చర్యలు తీసుకుని జరిమానాలు విధించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ అందుకు నగర కార్పొరేషన్ అధికారులు పెద్దగా స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు. కమిషనర్ ప్రతి ప్రాంతానికి వెళ్ళి ఆదేశాలు జారీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు కాని, అధికారులు కానీ, కాంట్రాక్టర్లు కానీ ఆయా ప్రాంతాలలో కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల గాంధీనగర్ -4 ప్రాంతంలో మురుగ కాల్వల నుంచి పూడికలు తీసి రోడ్డు మీద వేశారు. తిరిగి అది ఎండిన తరువాత దానిని

తరలించే నాథుడు కనిపించడం లేదు. ఎక్కడ పడితే చెత్తా చెదారం వేస్తున్నా దానిని పట్టించుకునేవారే కనిపించడం లేదన్నది వాస్తవం. అలాగే , చాలా ప్రాంతాలలో సఫాయిలు రోడ్లు శుభ్రం చేసిన చెత్తను రోడ్డుకిరువైపులా అలానే వదిలేస్తున్నారు. దీంతో ఆ చెత్తంతా ▶మిగతా 2లో..

కమిషనర్ గ్రీన్ సిగ్నల్

విధుల్లోకి 36 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మున్సిపాలిటిలో తొలగించిన 76 మంది కార్మికుల్లో 36 మందిని తిరిగి నియమించేందుకు కమిషనర్ అంగీకరించడంతో తొలగించిన ఉద్యోగుల వివాదం సద్దుమణిగింది. అయితే మొత్తం 76 మందిని కొనసాగించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టడంతో గురువారం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో ఇటీవల తొలగించిన ఔటిసోర్సింగ్ ఉద్యోగుల గురించి కౌన్సిల్ సభ్యులు కూలం కశంగా చర్చించారు. అయితే తొలిగించిన 76 మంది పారిశుద్ధ్య కార్మికులలో 36 మందిని మున్సి పల్ కమిషనర్ నిర్మల్ కుమార్ తిరిగి విధులలోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది యూనియన్ నాయకులు పారిశుద్ధ్య కార్మికుల నుండి డబ్బులు వసూలు చేసారని, వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు, 13వ వార్డు కౌన్సిలర్ సంసాని బులినాని కమిషనర్‌కు ఫిర్యాదు చేసారు. అదేవిధంగా వీధి కుక్కలకు ఎబిడి వ్యాక్సిన్‌లు వేసి

కంట్రోల్ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న ఆవులు, ఆంబోతులపై ఏవిధంగా చర్యలు తీసుకున్నారని, వేంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ నిర్మల్ కుమార్‌ను వైసీపీ సభ్యుడు సంసాని బుల్లి నాని డిమాండ్ చేశారు. ఈ కుక్కల ▶మిగతా 2లో..

సమస్యల వలయం (మొదటిపేజీ తరువాయి)

సైతం ప్రభుత్వ రంగంలో ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి చూపిస్తున్న ఆసక్తిని తమ పిల్లలను ప్రభుత్వ బడులు,కళాశాలలో చేర్పించడంలో కనబడటం లేదు.దీనిపై మేధావులు,విద్యావేత్తలు, సామాన్య ప్రజలు రాష్ట్ర, దేశ స్థాయిలో చర్చలు జరిపి లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది. విద్యలో పెరుగుతున్న అంతరాలను తగ్గించి,మార్పులను స్వాగతించాల్సిన సమయం ఆసన్నమైనది. ఆర్థికంగా,సామాజికంగా వెనుకబడిన కొన్ని కోట్ల మంది పిల్లలకు అవకాశాలు లేక ఐఐటి,మెడిసిన్, ఐఏఎస్ వంటివి అంతరిక్షపు తారగా మిగిలాయి.అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు,పరిశోధనలు మనదేశంలో పెద్దగా కనిపించడం లేదు.రీసెర్చ్ సంస్థల గణాంకాలే దీనికి ఉదాహరణ. నెహ్రూ కలలుగన్న భవిష్యత్తు భారతపు బాల్యం సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతుందనే చెప్పవచ్చు.

దేశ భవిష్యత్తు పార్లమెంటులో కాదు....

నేడు ఎన్నో అభిప్రాయాలు మనదేశంతో పాటు భారతంలో భవిష్యత్తు తరాలకు గుణాత్మక విద్య, ఉన్నత స్థాయి వైద్యం,బ్రతకడానికి భద్రత అందించాల్సిన బాధ్యత నేటి తరపు రాజకీయ నాయకులు, పార్టీలపై ఉంది. ముఖ్యంగా బాలలు,యువతకు సరళీకరణ ప్రపంచంలో నైతిక విలువలను వెలికి తీసే విద్యను అందిస్తూ మానవత్వం మంత్రంతో శాస్త్ర సాంకేతికత ద్వారా దూసుకు వెళ్లేలా చూడాలి.కాలుష్య రహిత సమాజంలో నేటి బాలలు కీలకం కావాలి.బస్టాండ్,పరిశ్రమలు, హొటళ్లు, యుద్ధాలలో, తదితర ప్రాంతాలలో బాల్యం బందీగా మారకుండా చూడాలి.తల్లిదండ్రులు కూడా తమ ఆశలు ఆశయాలు, పరువు పేరిట బరువును మోపి సాంప్రదాయాల పేరిట పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా జాగ్రత్త వహించాలి. నవజీవన బృందావన నిర్మాతలు, రాబోవు యుగానికి దూతలు అన్న మహాకవి శ్రీశ్రీ మాటలు ఈ దేశ భవిష్యత్తు పార్లమెంటులో కాదు పాఠశాలలోనే నిర్మించబడుతుందనే దార్శనికతను ప్రదర్శించి అంబేద్కర్ ఆలోచనలు నిజం కావాలి.

పారిశుద్ధ్య పద్ధతులు (మొదటిపేజీ తరువాయి)

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నీరు, లైటింగ్ మరియు శుభ్రపరిచే సహాయంతో 24x7 పనితీరును నిర్ధారించడానికి ఇప్పటికే ఉన్న పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పునరుద్ధరణ డ్రైవ్‌లను చేపట్టాలన్నారు. పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లు, బస్సు స్టాండ్లలో టాయిలెట్లను గుర్తించి వాటి నిర్వహణ మెరుగు పరచాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి క్రమం తప్పకుండా ప్రజా మరుగుదొడ్ల లభ్యత, వాటి నిర్వహణను నిర్ధారించడానికి ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర రహదారుల విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. స్థిరమైన నమూనాల కింద ప్రజా మరుగుదొడ్ల అవగాహన, నిర్వహణ కోసం స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్డబ్ల్యుఎస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవం (19 నవంబర్ 2025) సందర్భంగా సురక్షితమైన పారిశుద్ధ్యం, టాయిలెట్ వినియోగం, పరిశుభ్రత ప్రవర్తన జిల్లా యొక్క ప్రాముఖ్యతపై సామూహిక అవగాహన పోటీలను నిర్వహించాలన్నారు. సంబంధిత హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించి ఎస్ఎస్‌పి (రాూహూూ) ప్లాట్‌ఫామ్‌లో ఛాయాచిత్రాలు, వీడియోలు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సమర్థవంతమైన అమలు కోసం అన్ని శాఖల అధికారులతో సమన్వయాన్ని ప్రోత్సహించండి. ఎన్నికైన ప్రతినిధులు, విద్యాసంస్థలు పౌర సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయాలని జిల్లా సూచించారు.

కమిషనర్ గ్రీన్ సిగ్నల్ (మొదటిపేజీ తరువాయి)

నియంత్రణ ఏబిడి వ్యాక్సిన్లు వేసి నియంత్రించడం జరుగుతుందని, అదేవిధంగా పశువులు నియంత్రణ పై ఆయా యాజమానులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, అదేవిధంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మైక్ పబ్లిసిటీ చేయడం జరిగిందని తెలిపారు. యజమానులు స్పందించని పక్షంలో తూర్పు గోదావరి జిల్లా కడియంలో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన గో సంరక్షణ కేంద్రానికి తరలించడం జరుగుతుందని కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. అలాగే విశ్వరూప్ మార్గ్ 40 అడుగుల రహదారి నిర్మాణం పై ఉన్న ఆక్రమణలు గుర్తించి వెంటనే తొలగించాలని కౌన్సిల్ సభ్యులు బులినాని, గొవ్వాల రాజేష్ కమీషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు మట్టపర్తి నాగేంద్ర, బండారు గోవింద్, నాగారపు వెంకటేశ్వరరావు మహిళా కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ డీఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిశూన్యం (మొదటిపేజీ తరువాయి)

తిరిగి సమీపం కాల్వల్లోకి వెలుతోంది. ఆ చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన కంట్రాక్టర్లు కానీ, పారిశుధ్య పనివారలు కానీ కనిపించడం లేదు. పోనీ కాల్వలలోకి పడిపోయిన ఆ చెత్తనైనా శుభ్రం చేస్తున్నారా, కాల్వల్లో పేరుకు పోయిన పూడికలైనా తీస్తున్నారంటే అదీ లేదు.. దీంతో కాల్వలన్నీ దుర్గంధభరితమై దోమలు పెరిగిపోయి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నగర కార్పొరేషన్ కి స్వచ్ఛ నగరంగా అవార్డు కూడా లభించింది. నగరమంతా ఇంత చెత్త పేరుకు పోయినా అవార్డులు ఎలా ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కానీ, అధికారులు కానీ కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారు తప్ప, నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని బహిరంగంగానే ప్రజలు విమర్శిస్తున్నారు. మరో పక్క తమ తమ ప్రాంతాలకు కాల్వలు పూడికకు తీయడానికి పారిశుధ్య కార్మికులే రావడం లేదని గాంధీనగర్-4, సుబ్బారావు నగర్, క్వారీ , సిటిఆర్ఐ, తుమ్మలావ, అన్నపూర్ణమ్మ పేట, లలి తానగర్, లాలాచెరువుతో పాటు నగరంలోని అనేక ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు కల్పించుకుని రోడ్లమీద పేరుకు పోతున్న చెత్తను తొలగించాలని, రోడ్లను శుభ్రం చేయగా వచ్చిన చెత్తను ఏ రోజు కారోజు వాహనాలలో తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నగర సుందరీకరణకు, నగర పరిశుభ్రతకు చిత్త శుద్ధితో కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భర్తకు గాయాలు

విశాలాంధ్ర - గణపవరం: మండల కేంద్రమైన గణపవరం గ్రామపంచాయతీ పరిధిలో చిన్న రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొట్టు సత్యవతి(55) లారీ ఢీకొని మృతి చెందిందని గణపవరం ఎస్ఐ ఏ మణికుమార్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొట్టు సత్యనారాయణ సత్యవతి దంపతులు మండలంలోని వల్లూరు గ్రామంలో వారి కుటుంబ సభ్యులకు దగ్గరకు వెళుతుండగా వదరాజపురం గ్రామ శివారులో కొత్తపల్లి అడ్డరోడ్డు పుంత దగ్గర స్కూటీ మీద వెళుతున్న దంపతులని క్వారీ లారీ వెనుక నుండి ఢీకొందని ఆయన తెలిపారు.సత్యవతి అక్కడికక్కడే మృతి చెందిందని, సత్యనారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డారని తెలిపారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అన్నారు.

'ఇంటి దొంగ' అరెస్ట్

విశాలాంధ్ర- భీమవరం టౌన్: ఇల్లు అద్దెకు కావాలని తిరుగుతూ అదును చూసి దొంగతనాలకు పాల్పడుతున్న పట్నాల మోహన్ లక్ష్మీ సాయి అనే వ్యక్తిని, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. భీమవరం మండలం కొవ్వాడ పుంత,నరసింహపురం రోడ్లో కాలువ ధనలక్ష్మి అనే మహిళ ఇంటికి తాళం వేసుకుని బయటికి వెళ్ళగా మధ్యాహ్నం ఆ ఇంటి తాళాలు పగల గొట్టి 12 కాసులు బంగారం చోరీ చేయటంతో నిఘా పెట్టిన పోలీసులు మోహన లక్ష్మీ సాయిని అదుపులోకి తీసుకుని విచారించగా భీమవరంలో మరో రెండు చోట్ల చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని భీమవరం డిఎస్పి జయసూర్య గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అతను వద్ద నుంచి సుమారు 18 లక్షలు రూపాయలు విలువైన బంగారు నగలు, లక్ష విలువైన వెండి వస్తువులు, స్కూటర్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. త్వరతగతిన చోరీ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందికి రివార్డులను డీఎస్పీ జయసూర్య అందజేశారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - తణుకు: ఎస్ కే సి డి మహిళా కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఇరగవరం మండలం గోటేరు గ్రామంల మూడవరోజు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు లక్ష్మీ సుందరి భాయ్ తెలిపారు. ఈ సందర్భంగా తణుకు పట్టణానికి చెందిన సన్ హాస్పిటల్ వారితో కలిసి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎస్ శోభా శరన్ పలువురు గ్రామ ప్రజలకు బిపి, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కన్స్యూమర్ ఫామ్ డిస్టిక్ ప్రెసిడెంట్ పివిఎస్ శంకర్ వినియోగదారుల, హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సిహెచ్ రమేష్ బాబు, కె.వి. శ్యామలాదేవి వాలంటీర్లు ,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు చూడాలి : జేసీ

విశాలాంధ్ర - గణపవరం: ధాన్యం కొనుగోలు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులు ఆదేశించారు. గురువారం గణపవరం మండలం మొయ్యేరు గ్రామంలో రైతు సేవ కేంద్రంను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు ఉపయోగించే యంత్ర పరికరాలను, తేమశాతం తెలిపే పరికరాన్ని ఆయన పరిశీలించారు. మిల్లుల నుండి సేకరించి భద్రపరిచిన గన్ని బ్యాగ్ స్టాక్ నాణ్యతను పరిశీలించారు. ఏ మిల్లు నుండి ఎన్ని గన్ని బ్యాగులను తీసుకుని వచ్చారు, ఎంతమంది రైతులకు గన్ని బ్యాగులను ఇచ్చారు. అని అడిగి తెలుసుకుని రికార్డులలో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. రైతులు ఆర్ఎస్కే వద్ద తేమ శాతం, మిల్లు వద్ద తేమ శాతము తేడాగా ఉంటుందని రైస్ మిల్లు వద్ద తేమశాతం ఎక్కువ చూపించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని జాయింట్ కలెక్టర్ వద్ద రైతులు విన్నవించుకున్నారు. రైతులు చేసిన కంప్లైంట్ పై స్పందిస్తూ మిల్లులు వద్దకు వెళ్లి తేమశాతం చూసే పరికరాలను పరిశీలించి రిపోర్టు అందజేయాలని జెసి అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గణపవరం డిప్యూటీ తహసిల్దార్ శేఖర్ బాబు, సివిల్ సప్లయ్ డిటి రత్నం, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ జి.సన్నీ ప్రసాద్ కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొల్లేపల్లి ప్రసాద్, వీఆర్వో, వీఆర్ఏ, మొయ్యేరు సొసైటీ సీఈవో ఎం దుర్గా శ్రీనివాసరావు, ఆర్ఎస్కే సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

మెనూను ఖచ్చితంగా అమలు చేయాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జె. కృష్ణ కిరణ్

విశాలాంధ్ర - భీమవరం: ఎంఈఓలు తరచూ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించాలని, గురుకుల పాఠశాలలు విధిగా మెనూను అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జె. కృష్ణ కిరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ మెంబెర్ జె.కృష్ణ కిరణ్ జిల్లాలో రెండో రోజు పర్యటనలో భీమవరం శివరావు పేటలో అంగన్వాడీ కేంద్రాన్ని, ఉండి మండలం జిల్లా పరిషత్ స్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం అమలును అడిగి తెలుసుకున్నారు. గణపవరం మండలంలో జల్లి కొమ్మర గ్రామంలో ఉన్న రెండు రేషన్ షాప్స్ ని, జిల్లా పరిషత్ స్కూల్, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు సమకూరుతున్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీచేశారు. విద్యార్థులకు నాణ్యతతో మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. తరచూ మండల విద్యాధికారులు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించాలన్నారు. అంగన్వాడీలు చిన్నారులకు అందించే ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయించాలని సూచించారు. గురుకుల పాఠశాలలో ప్రభుత్వం సూచించిన మధ్యాహ్న భోజనం మెనూను తూచా తప్పక అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎన్.సరోజ, మిడ్ డే మీల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది, ఎంఈఓలు వున్నారు.

తుపాను బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - తణుకు : తుఫాన్ ప్రభావాన్ని అధికారులు కూటమి నాయకులతో సమర్థవం తంగా ఎదుర్కొన్నామని స్థానిక శాసన సభ్యులు ఆరిమిల్లి రాధా కృష్ణ చెప్పారు. గురువారం తణుకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 1250 కుటుంబాలను గుర్తించామని వారికి ప్రభుత్వం నుంచి ఈ సరుకులను అందజేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ సారా ధ్యంలో రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి ముందు కెళు తుదన్నారు. చంద్రబాబు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి కి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు. పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం

విశాలాంధ్ర - ఉండి : విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగస్తులు ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తే అవార్డులు ప్రశంస పత్రాలు వాటి అంతట అవే వస్తాయని నిరూపించారు సైలాడ చిన్నారావు, విజయబాబు. మండల పరిధిలోని మహదేవపట్నం గ్రామపంచాయతీలో గ్రామ రెవెన్యూ అధికారులు పనిచేస్తున్న సైలాడ చిన్నారావు, డిజిటల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న విజయబాబుకు మినిస్ట్రీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ అధికారి డోల బాల వీరాంజనేయ స్వామి నుండి చిన్నారావు విజయబాబు ప్రశంస పత్రాలు పొందారు. మోత తుఫాన్ సమయంలో చిన్నారావు విజయబాబు ప్రజలకు రైతులకు ఈదురుగాలను సైతం లెక్కచేయకుండా ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిని ప్రశంస పత్రంతో గౌరవించింది. ప్రజలతో మమేకమై ప్రజల ఇబ్బందులను సం స్థలు పరిష్కరించడంలో చురుకైన పాత్ర వహించిన చిన్నారావు విజయ బాబులకు సహచర ఉద్యోగులు గురువారం అభినందించారు. ఉత్తమ సేవలకు ఉత్తమ అవార్డులు ప్రశంస పత్రం పొందగలరని వారు నిరూపించారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - టి నరసాపురం : టి నరసాపురం పంచాయితీ లోని కృష్ణా పురం గ్రామం లో అదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఎంపిడీఓ మణికుమారి ఆధ్వర్యం లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బిర్సా ముండా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19వ శతాబ్దపు చివరి రోజుల్లో నేటి బీహార్, జార్ఖండ్ అటవీ ప్రాంతంలో బ్రిటీష్ కాలంలో జరిగిన మిలీ నేరి యన్ ఉద్యమానికి సారథ్యం వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మంలో పంచాయితీ కార్యదర్శి కె చంద్ర శేఖర ప్రసాద్, పి శేఖర్ బాబు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు

విశాలాంధ్ర - పోలవరం : పోలవరం మండలం పట్టిసీమ పంచాయితీ బంగారంపేట నుండి కన్నాపురం అడ్డరోడ్ వరకు సుమారు 12 లక్షల రూపాయలతో మరమ్మత్తులు చేసిన ఆర్ అండ్ బి రోడ్డు పది నెలలు కాకముం దనే అధ్వానంగా తయారైంది. రోడ్డు మరమ్మత్తులు నాణ్యత పరిమాణాలు చెయ్యకపోవడం వల్ల కొద్ది రోజుల్లోనే పెద్ద పెద్ద గోతులు పడ్డాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు మార్గం ద్వారా ఆర్టీసీ బస్సులు, విద్యార్ధిని విద్యార్థులు స్కూళ్లకు, వ్యాపారాలు, ఆరోగ్యరీత్యా హాస్పటలకు పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నరకం అనిపిస్తున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు కి యాక్సిడెంట్ రూపంలో గాయాలు పాయలైన సంఘటనలు కూడా చోటుచేసుకుంటాయి. రోడ్డు మార్గంలో ప్రతిరోజు అనేక శాఖల అధికారులు వెళ్తూ ఉంటారు కానీ ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించు కుని ఈ రోడ్డు మార్గంలో ఉన్న గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలు ఎవరూ లేరు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలు ఎవరూ లేరని తాడేపల్లి గూడెం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. రూరల్ మండలం చిన్న తాడేపల్లి లో సర్పంచ్ పిచ్చుకల రాజారావు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన పార్టీలోకి చేరికలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగానే కొందరు రాబోయే ఎన్నికల్లో నేనే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అధికారులను నాయకులను బెదిరిస్తున్నారని అలాంటి చర్యలు ఉపేక్షించనని హెచ్చరించారు. నేను అవినీతి చేశా నని కొందరు విమర్శిస్తున్నారని అవినీతి చేసినట్టు నిరూపించాలని, ఎవరైనా నాకు లంచం ఇచ్చిన వారు ఉంటే సవాల్ విసిరారు. ఊపిరి ఉన్నంతవరకు రాజకీయాల్లోనే ఉంటానని, ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అవకాసం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని జగన్ మరోసారి అధికారం ఇస్తే రాష్ట్రానికి అరిష్టం పడు తుందని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధి, సుప రిపాలన అందించడమే లక్ష్యంగా తాను పనిచేస్తానని పేర్కొన్నారు. చిన్న తాడేపల్లిలో సర్పంచ్ పిచ్చుకల రాజారావు, ఎంపీటీసీ దూలపల్లి సత్తయ్య, పిచ్చికల అమ్మన్న, మాజీ సర్పంచ్ బయ్యే వెంకట్రావు, మాజీ ఉపసర్పంచ్ పరిమి రాంబాబు, పంచాయతీ బోర్డు మెంబర్లు కాసాని వీరరాఘవులు ,ఒకటో వార్డు గొల్లపల్లి ధర్మరాజు, నాలుగో కొక్కిరాల గోవిందు, మేడ వంకల పెద్దిరాజు, దూలపల్లి నర్సమ్మ, తొంటా రాంబాబులతో 200 మంది జనసేన లో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పైబోయిన రఘు, రాజా, పెంటపాడు మండల అధ్యక్షుడు బాబీ పాల్గొన్నారు.

వేంద్ర పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం వేంద్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బాలికలు వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ రంగాల్లో జరిగిన చిత్రలేఖన పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని దీపిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా,రాజ్యాంగ నిర్మాణమునకు దారి తీసిన పరిణామాలపై వ్యాచారచన ఉండి నియోజకవర్గ స్థాయిలో తొమ్మిదో తరగతి విద్యార్థిని మల్లుల తేజ శ్రీవల్లి ప్రథమ స్థానం సాధించగా, ఇండియా ఫౌండేషన్ వారు ప్రతి సంవత్సరము నిర్వహించే వ్యాసరచన వక్తృత్వం వాదోపవాదాలపై జరిగిన పోటీలలో జిల్లా స్థాయిలో తొమ్మిదో తరగతి విద్యార్థి వనం కృతిక ప్రథమ స్థానంలో నిలిచింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వము వస్తువులు మరియు సేవలపై పన్ను తగ్గింపు పై విద్యార్థులకు(సూపర్ జీఎస్టి 2.0)అవగాహనలో భాగముగా పాఠశాలస్థాల స్థాయిలో చిత్రలేఖన పోటీలు నిర్వహించగా పదవ తరగతి విద్యార్థినులు ఏ.గాయత్రి ప్రథమ స్థానం, ఆర్ జాహ్నవి ద్వితీయ స్థానం సాధించారు. జిల్లాస్థాయిలో బహుమతి సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీ జీవివి శ్రీనివాస్, ఉపాధ్యాయులు జై శ్రీనివాస్, ఏసుబాబు, పణి రాజేష్, పంపన సాయి బాబు, పార్వతి రాజవర్ధని రాధా, సుబోసు వెంకటరమ, ఎమ్మెస్ శ్రీనివాస్ అభినందించారు.

ఉపాధి హామీ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - ఉంగుటూరు : జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఉంగుటూరు గ్రామ సర్పంచ్ బండారు సింధు మధుబాబు తెలిపారు. గురువారం ఉంగుటూరు గ్రామపంచాయతీ కమిటీ హాల్ లో ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులు గురించి గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి సింధు మధు బాబు మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఉంగుటూరులో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు కృషితో ఉపాధి హామీ నిధులతో గ్రామాలలో రహదారులను అభివృద్ధి చేశారన్నారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అసరపల్లి కనకారావు ఉపాధి కూలీలకు ఈ కేవైసీ గ్రామంలో 90% పూర్తి చేశారని ఆయనను గ్రామసభలో అభినందించారు. ఈసి ఉదయభాస్కర్ మాట్లాడుతూ.. పనులు చేసిన ఈ కేవైసీ ఉంటేనే వారికి వేతనాలు పడతాయన్నారు. సమావేశంలో గ్రామ ఉప సర్పంచి పాతూరి జగదీష్, వార్డు సభ్యులు సూరత్తుల అయ్యప్ప, మల్లేశ్వరి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ అసరపల్లి కనకారావు, ఉపాధి హామీ కూలీలు, మేట్లు పాల్గొన్నారు. గ్రామసభ మండలంలోని వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి యల్లమిల్లి సతీష్ కుమారి అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్లానింగ్ పై సర్పంచ్ మాట్లాడారు. గ్రామంలో పెండింగ్లో ఉన్న పనులను దశలవారీగా జాతీయ ఉపాధి హామీ పథకం లో పూర్తి చేయాలని దీనికోసం పనులను గుర్తించాలని ఆమె పంచాయితీ అధికారులకు గ్రామంలో చేయాల్సిన పనులను వివరాలను గ్రామ ప్రజలను వార్డు సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఏపీవో లక్ష్మీ గణపతి రావు , జేఈ ఈశ్వరరావు , పంచాయతీ కార్యదర్శి శ్రీమతి అరుణ, ఫీల్డ్ అసిస్టెంట్ మణికంత , ఉపాధి హామీ లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు :ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 తేది వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయ అధికారి యాగంటి శ్రీదేవి తెలిపారు. ఆ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన తెలిపారు. గ్రంథాలయం వారోత్సవాలు సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, ఆటల పోటీలు, మహిళలకు ప్రత్యేకంగా ఆటలు పోటీలు జరుగుతాయని శ్రీదేవి తెలిపారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయ వారోత్సవాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చెత్త నుంచి సంపద సృష్టించవచ్చు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా చేపట్టాలని, చెత్త ద్వారా సంపదను సృష్టించవచ్చునని ఉంగుటూరు డిప్యూటీ ఎంపీడీవో గెద్దం రమేష్ బాబు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కాగుపాడు గ్రామంలో తడి చెత్త పొడి చెత్త పై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించే విధానాన్ని అలవాటు చేసుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ, చెత్త నుంచి సంపాదనను సృష్టించే విధానాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. ప్రతి రోజు ఇంటింటా నుంచి చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా జరగాలని సిబ్బందికి రమేష్ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిపెద్దిరాజు, పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ. సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల ఆటల పోటీలు

విశాలాంధ్ర - భీమవరం : గత రెండు రోజులుగా ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు డిఎన్నార్ గ్రౌండ్స్లో నిర్వహించిన వివిధ ఆటల పోటీలు ముగిసినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎన్.మోహన్ దాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, క్యారమ్స్, చదరంగం, ఫుట్బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, క్రికెట్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్ ప్లే మొత్తం 19 విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహించారు. ఎక్కువమంది క్రికెట్, చెస్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ ఆటలకు ఆసక్తిగా పాల్గొన్నారు. రెండు రోజులు నిర్వహించిన క్రీడా పోటీలలో పురుషులు, మహిళలు మొత్తం 58 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరిలో 44 మంది పురుషులు, ఎనిమిది మంది స్త్రీలు వివిధ విభాగాలలో ఎంపిక అయ్యారుజ. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనసున్నట్లు మోహన్ దాస్ తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పిల్లల పౌష్టికాహారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని గణపవరం మండలం కాశిపాడు గ్రామ సర్పంచ్ తెర్లి నాగరాజు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా రైస్ మిల్లర్స్ సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడి మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులను దృష్టి లో పెట్టుకుని ప్రభుత్వం సన్న బియ్యం వండించడం ద్వారా మధ్యాహ్న భోజన పథకం తినేవారి సంఖ్య పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మం డల బిజెపి అధ్యక్షులు కొయ్యల వెంకట సుబ్బారావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకట్రావు, గ్రామ జనసేన అధ్యక్షులు చింత చరణ్, గ్రామ నాయకులు సుధాకర్ రాజు మహేష్, ఇన్ ఛార్జి ప్రధానోపాధ్యాయులు వానపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రజా దర్బార్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గం ఏజెన్సీ ముఖ ద్వారమైన కొయ్యల గూడెం పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నేడు రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 10 గంటల నుండి సాయం త్రం నాలుగు గంటల వరకు గ్రీవెన్స్ (ప్రజా దర్బార్) ను జాతీయ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తారని నియోజకవర్గంలో ఉన్న పలు ప్రజా సమస్యలపై ఏర్పాటు చేసే ఈ కార్య క్రమంలో ప్రజలు తమ వినతులను విన్నవించవలసినదిగా శ్రీనివాస్ తెలి పారు. తమ సమస్యలను గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని బొరగం శ్రీనివాస్ తెలిపారు.

నాటు సారా వద్దు, కుటుంబమే ముద్దు

విశాలాంధ్ర - లింగపాలెం : నాటు సారాను నిరోధించడంలో అందరం చేయి చేయి కలిపి సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దు దామంటూ ఎక్సైజ్ శాఖ అధి కారులు వేములపల్లిలో జరిగిన అవగాహన సదస్సులో పేర్కొన్నారు. ఈ సదస్సులో సారా తాగితే వచ్చే నష్టాలు వివరించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా ఎక్సైజ్ సూపరిం టెండెంట్ ఆవులయ్య, చింతలపూడి ఎక్సైజ్ సి.ఐ పి.అశోక్, గ్రామ సర్పంచ్ నత్త దివ్య దీప్తి, పంచాయతీ సెక్రటరీ సంధ్యా రాణి, ధర్మాజీ గూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామపెద్దలు అం గన్‌వాడీ, డ్వాక్రా, ఆశా సిబ్బంది పాల్గొ న్నారు. గ్రామంలో నాటు సారా అమ్మినా, తయారుచేసిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలియజేశారు. అలాగే గ్రామంలో పిడియాక్ట్‌ను అమలుపరుస్తున్నామని గ్రామ పంచాయతీ అధి కారులకు, ప్రజలకు తెలియజేశారు. నాటుసార విక్రయించిన తయారు చేసిన వారు పట్టుబడితే 6 నెలలపాటు బెయిల్ ఉండదని బైండోవర్ కేసు నమోదు చేసి రూ1.50 లక్ష జరిమానా విధిస్తామని తెలిపారు.

బోర్డు సూచించిన పంటను పండించాలి

విశాలాంధ్ర - కొయ్యల గూడెం : వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ఈనెల 19వ తేదీతో ముగియనున్నట్లు వేలం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరేట్ పేర్కొన్నారు. రైతు ప్రతినిధులతో కలసి వేలం కేంద్రంలో సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పొగాకు నారు మళ్లు, తోటల సీజన్ ప్రారంభం అయిందని, బోర్డు సూచి చిన మేరకు పంటను పండించాలని రైతులకు సూచించారు. గత రెండు సీజన్లు అనుమతులు మేరకు మించి పండించినప్పటికీ విదేశీ ఆర్డర్స్ వలన రైతులకు గిట్టుబాటు ధర లభిం చిందన్నారు. అయితే వచ్చే సీజన్ ఇప్పటిలా ఉండే అవకాశం లేదని అందుకు కారణం విదేశాలలో కూడా సమృద్ధిగా పొగాకు పండించడమే అని ఆమె అన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది మాట్లాడుతూ లో గ్రేడ్ పొగాకు ధరకు ఆశించిన మేర ధర రాక పోవడానికి పరిమితికి మించిన పంట కారణం అయ్యిందని తెలిపారు. రైతులు బోర్డుకు అనుకూలమైన విధంగా ఉత్పత్తి నాణ్యతలను పాటించా లని సూచించారు.

నియోజకవర్గంలో 2328 ఇళ్ల నిర్మాణం పూర్తి

సామాన్యుల సమస్యలపై సొంగా శ్రద్ధ

విశాలాంధ్ర - చింతలపూడి రూరల్: సామాన్యులు సమస్యలు తెలుసుకోవడానికి జీవన పరిస్థితులు రోజువారి జీవన విధానం గురించి తెలుసుకోవడానికి సొంగా రోషన్ సామాన్యులతో మమేకమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మూడు లక్షల 192 ఇళ్ళ ప్రారం భోత్సవ కార్యక్రమంలో చింతలపూడి గ్రామీణ ప్రాం తంలోని మల్లాయ్య గూడెం గ్రామంలో ఎంఎల్ ఎ రోషన్ కుమార్ చేతుల మీదుగా గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సామాన్యుల రోజు వారి జీవితంలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకోవడానికి ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచారు. సామాన్యులు తెలిపిన సమస్యలను సొంగా ఓపికగా విన్నారు. రోడ్లు గుంతల దగ్గర నుండి ప్రతి సమస్యను పరిష్కరించడానికి వ్యక్తిగతం గా పని చేస్తున్నానని తెలిపారు. మల్లాయ గూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యురాలు చీకటి కవిత రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకా రంతో సమగ్రమైన అభివృద్ధి సాధిద్దామన్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ మొత్తం లో 2328 చింతలపూడి గ్రామీణ ప్రాంతంలో 241 ఇళ్ళు నిర్మాణం పూర్తిఅయింది . 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 2328 ఇళ్ళ పనులు పూర్తి అయినట్లు తెలుస్తోంది. విద్యావంతుడైన సొంగా రోషన్ కుమార్ దళితులు బడుగు బలహీన వర్గాల వారి సమస్యల పట్ల వాటి పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపు తున్నారని పలువురు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధుల కన్నా ప్రస్తుత చంద్రబాబు పాలనలో ఎస్సీలకు బీసీలకు 50,000 పెంచడం ఎస్టీలకు 75000 పెం చడం చర్చనీయాంశమవుతుంది. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో మరో 646 ఇళ్ళు మంజూరు కాగా పూర్తిస్థాయి అనుమతుల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది.

ఎస్సీ బాలికల వసతి గృహాల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యల గూడెం : ఎస్సీ బాలికల వసతి గృహాల అభివృద్ధికి సంబంధిత ప్రభుత్వ అధికారులు చర్యలు తీసు కోవాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘ లాదేవి పేర్కొన్నారు. మండలంలో పరింపూడి గ్రామంలో ఉన్న వెనుకబడిన తరగ తుల బాలికల వసతి గృహం శిథిలా వస్థకు చేరు కుంటుందని సంబంధిత అధికారులు వసతి గృహ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. వసతి గృహా న్ని ఆమె గురువారం సందర్శించారు. వసతి గృహంలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో గోడలు బీటలు వాచ్చి కాంపౌండ్ వాల్ చుట్టూ ఉన్న గోడ శిథిల వస్థకు చేరు కోవడం, గేటు పడిపోవడం, విద్యార్థినిలు వినియోగించే బాత్రూంలు తక్కువగా ఉండ డంతో వారు అవస్థలు పడుతు న్నారని ఆమె తెలుసుకున్నారు. శిథిలవస్థకు చేరుకోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పుడు కూడా సంబంధిత అధికారులు వసతి గృహాలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉం డటం సరికాదని అధికారులను హెచ్చరిం చారు. వసతి గృహాలలో విద్యార్థు లకు మౌలిక వసతులు కల్పించాలని ఆమె అధికారులను కోరారు.

చేతివృత్తిదారులను ఆదుకుంటాం



విశాలాంధ్ర - భీమవరం : చేతివృత్తు దారులు సాధికారత సాధించేలా ప్రభుత్వం అం డగా నిలవాలని పశ్చిమగోదావరి జిల్లా చేతివృత్తి దారుల సమాఖ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేతి వృత్తుల దారుల సమస్యలు పరిష్కరించి రుణాలు మంజూరు చేయించాలని కోరుతూ కృష్ణ బలిజ పూసల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య గౌరవా ధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, జిల్లా అధ్యక్షులు జేగురు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు, మత్స్యకార సంఘం జిల్లా నాయ కులు మోకా నరసింహస్వామి తదితరులు మాట్లాడుతూ ఎన్డీఏ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటిందని ఇప్పటి వరకూ ప్రభుత్వం వారి కేమీ చేయలేదని విమర్శించారు. 60 కుల వృత్తు లకు కార్పోరేషన్ లు నెలకొల్పారని, ఆయా వర్గా లకు ఇంకా రుణాలు మంజూరు చేయలేదని ఆవే దన వ్యక్తం చేశారు. ప్రధానంగా 30 రకాల చేతి వృత్తులు వారు ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల్లో ఉన్నారని వీరు మహేంద్ర, కుమ్మరి, కుమ్మరి, మత్స్యకార, గొర్రె మేకల పెంపకందారులు, దర్జీ, పూసలు, చర్మం కారులు, గీత, రజక, నాయీ బ్రాహ్మణ, పందుల పెంపకం వృత్తుల వారికి 10 లక్షల వరకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం స్వీకరించిన చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ బీసీ వర్గాల వృత్తిదారులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి వారని వీరి అభ్యర్థనను తక్షణమే ముఖ్య మంత్రి చంద్రబాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితమ్మ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు అభి వృద్ధి చెందితేనే సమాజం బలపడుతుంది. బీసీ వర్గాల పురోగతి కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు.

జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - టి.నరసాపురం : నేటి నుండి జరిగే 58వ గ్రంధాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని గ్రంథాలయ పాలకులు ఆర్ కిషోర్ తెలి పారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రందాలయ వారోత్సవాలు నవంబరు 14నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నవంబరు 14 బాలల దినోత్సవాన్ని పురస్క రించుకొని బాలలకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సిపిఆర్ విధానంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సిపిఆర్ విధానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కొల్లూరి లక్ష్మణ్ తెలిపారు. మండలంలో గవరవరం గ్రామంలో ఉన్న సాయి రాకేష్ విద్యాసంస్థల ఆవరణలో గురువారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో మనిషికి గుండెపోటు వస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సిపిఆర్ అంటే గుండె , ఊపిరితిత్తులు పనిచేయకుండా ఆగి పోతే వాటిని రీసెర్ట్ చేయడమే అని ఆయన అన్నారు. ఎవ రికైనా అనుకోకుండా గుండె ఆగిపోతే ఎవరైనా సరే సిపిఆర్ చేయవచ్చని, సిపిఆర్ చేయడం వలన మనిషికి మరల గుండె పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ ఆర్ నరసింహరాజు, కేశవ రావు, రోటరీ క్లబ్ సభ్యులు కొనకళ్ళ రామచంద్రరావు, క్యాంప్ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ, బొనగిరి పాపారావు, దారం సత్తిరాజు, యాతం సత్యనారాయణ, మజ్జి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

విశాలాంధ్ర- భీమవరం టౌన్: జిల్లాలో చోరీకి గురైన లేదా పోగొట్టు కున్న మొబైల్ ఫోన్ల 11వ విడత రికవరీ , పంపిణీ కార్యక్రమం గురువారం గొల్లలకోడేరు లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఫోన్లు పోగొట్టుకున్న యజమానులకు జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి చేతుల మీదుగా సుమారు రూ.18,90,000 విలువగల 126 మొబైల్ ఫోన్లను వాటి సంబంధిత యజ మానులకు అందజేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ చేజార్చుకోవడమో, దొంగిలించబడడమో, ప్రయాణాలలో మర్చిపోవడమో జరిగినప్పుడు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మొబైల్ నెంబరు 9154966503 కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేసి, వచ్చిన లింక్ ద్వారా ఆన్లైన్ లో వివరాలు నింపడం ద్వారా జిల్లా ప్రజలు కనీసం పోలీసు స్టేషన్ కి కూడా వెళ్లకుండా చోరీకి గురైన లేక పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తక్షణమే తిరిగి పొందుటకు అవకాశం ఉంటుందని ఎస్పీ తెలియ జేశారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని పోగొట్టుకున్న మొబైల్స్‌ను సులభంగా తిరిగి పొందవ చ్చు న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు విడతల వారిగా సుమారు 2 కోట్ల 60 లక్షల రూపాయల విలువగల 1738 సెల్ ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అందించా మన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీమతి అహ్మదున్నీషా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంద్ ఎడ్యుకేషనల్ విద్యార్థులు
టెన్నికాయిట్‌కు ఎంపిక

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం దేవరపల్లి ఆనంద్ ఎడ్యు కేషనల్ జూని యర్ కళాశాల విద్యా ర్థులు జాతీయస్థాయి టెన్నికాయిట్ రన్నింగ్ 200 మీటర్లు పోటీలకు ఎంపికయ్యారు. దేవరపల్లి ఆనంద్ ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అండర్ 18 పోటీలు విభాగంలో రాపాక సంస్కృతి నాలుగో స్థానం బి ఆనంద్ కుమార్ 7వ స్థానం సాధించారు. ప్రకాశం జిల్లా చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 18 టెన్నికాయిట్ పోటీలలో ఉభయ పశ్చిమ గోదావరి జిల్లా నుండి పోటీలు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజయాలు సాధించి త్వరలో జమ్ము కాశ్మీర్లో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటా రని ప్రిన్సిపాల్ విక్రమ్ తెలిపారు. ఇదే విధంగా అండర్ 19 రన్నింగ్ 200 మీటర్ల విభాగం నుండి ఏలూరు జిల్లా పెదవేగి లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాల క్రీడా కారుడు రన్నింగ్ 200 మీటర్ల విభాగంలో పాల్గొని రంజిత్ కుమార్ 4 స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం విక్రమ్ తెలిపారు. ఇదేవిధంగా నాలుగో స్థానం సాధించిన క్రీడాకారుడు రంజిత్ కుమార్ త్వరలో హర్యానాలో జరిగే జాతీయస్థాయి రన్నింగ్ 200 మీటర్లు విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. గురువారం జరిగిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాం డెంట్ డి సువర్ణ రాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు క్రీడలలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నా రని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓడీ శ్రీనివాస్, షాప్ డైరెక్టర్ రమణ పాలెం హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్, హై స్కూల్ పిడి తలారి సరస్వతి, అధ్యాపకులు హేమ, సునీత, నాగలక్ష్మి, శ్రీనివాస్‌రావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎర్న గూడెం శాఖ గ్రంథా లయంలో ఈనెల14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వార్చవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు ప్రతాప్ కుమార్ గ్రంథాలయ అధికారి జి అనిత గురు వారం స్థానిక విలేకరులు తెలిపారు. 14వ తేదీన బాలల దినోత్సవం మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమాలు జరుగుతాయని 15న పుస్తక ప్రదర్శన 16న వివిధ అంశా లపై ప్రము ఖుల ప్రసంగాలు 17, సైబర్ నేరాలపై అవగాహన పై సెమినార్ 18న విద్యార్థులకు వ్యాస రచన డ్రాయింగ్ వృక్తిత్వం పోటీలు 19న మహిళా దినోత్సవం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు 20వ తారీఖున ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం గ్రంథాలయ అభివృద్ధి కమిటీలో జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు స్థానిక అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా "లక్షబిల్వార్చన"

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రమైన కడియం గ్రామంలో గల శ్రీ భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో, కార్తీకమాసం పురస్కరించుకొని, గురువారం లక్ష బిల్వార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంశపారంపర్య ఆలయ ప్రధాన అర్చ కులు అప్పలి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు మహాసంకల్పంతో మొదలై, గణపతి పూజ, పుణ్య వచనం, మండపారాధన, మహాన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం మూడు గంటల నుండి లక్ష బిల్వార్చన కార్యక్రమం, సాయంత్రం ఐదు గంటలకు సహస్రనామ కుంకుమార్చన, అనంతరం స్వామివారి శాంతి కళ్యాణం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి వేద ఆశీర్వచనాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర-సీతానగరం: రైతులను రాజులుగా చేసేందుకు నిరంతరం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో రఘు దేవపురం, చినకొండేపూడి గ్రామ రైతుసేవాకేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ శశిబిందు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుమారు రెండు వేల కోట్ల రూపాయల రైతుల ధాన్యం కొనుగోలు బకాయిలను తీర్చిన ఏకైక ప్రభుత్వం అని అన్నారు. రైతులకు సబ్సిడీలపై యంత్రాలను, డ్రిప్ ఇరిగేషన్ అందిస్తూ పామ్ ఆయిల్ మొక్కలను ఉచితంగా అంది స్తుందన్నారు. అధికారంలోకి రాగానే వచ్చిన తుఫా నుకు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించిందన్నారు. రైతు రాజుగా చేసేం దుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కట్టుబడి ఉందన్నారు. రుడా చైర్మన్ మాట్లాడుతూ ఒకప్పుడు రైతును వివాహం చేసుకోవడానికి పోటీపడేవారని నేడు రైతు అంటే పెళ్లిళ్లు కావడంలేదన్నారు. ఈ పద్ధతిని మార్చేందుకే సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయంలో అధునాతన పద్ధతులను రైతులు అనుసరించే విధంగా త్వరలోనే ఒక ప్రణాళి కను సిద్ధం చేస్తున్నారన్నారు. కోస్తా జిల్లాలంటే రైస్ బౌల్ అని పిలిచేవారన్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ భారతి, ఏ ఓ గౌరీ దేవి, ఎమ్ ఎస్ ఓ నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ తన కాల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు కాండ్రు శేఖర్, కవల గంగాధరరావు, మట్టా వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు గెడ్డం తిమ్మరావు, కూటమి నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలభివృద్దే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- అనపర్తి: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి పదం వైపు అడుగులు వేస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొ న్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలో 33 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మూడు సీసీ రోడ్లు, రెండు డ్రెయిన్లను ఆయన ప్రారంభించారు. ఎన్ఆర్ ఈజీఎస్, పంచాయతీరాజ్ నిధులతో ఈ కార్యక్ర మాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అనపర్తి తహసీల్దార్ డి అనిల్, ఎంపీడీవో మంద రామ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ డిఇ ఇ అచ్యుత రామా రెడ్డి, వైస్ ఎంపీపీ పుల్లగం బుల్లి రెడ్డి, సొసైటీ అధ్యక్షులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, దత్తుడు శ్రీను, మాజీ ఎంపీపీ కర్రీ శేషారత్నం, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు కరి వెంకటరెడ్డి, సర్పంచ్ గిరిడ గంగాభవాని, కుతుకులూరు సర్పంచ్ హేమ తులసి, ఎంపిటీసీలు గొలుగూరి గౌతమి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి విలువైన పుస్తకాలు సమకూరుస్తా

విశాలాంధ్ర - నల్లజర్ల : నల్లజర్ల లోని గ్రంథాలయానికి నిరుద్యోగులకు విద్యార్థులకు ఉపయోగపడే అత్యంత విలువైన పుస్తకాలను స్వతహా కొనుగోలు చేసి అందజేస్తానని స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్ రాజు గ్రంథాలయ అధికారిణి అన్నంరెడ్డి వెంకట రమణకు హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్న సందర్భంలో ప్రత్యేక ఆహ్వానితు లుగా ఆయనను పిలిచేందుకు వెళ్లిన గ్రంథాలయ సిబ్బందితో విషయాన్ని తెలిపారు. మూడు కంప్యూటర్లు, కావాలని కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగ పడే మెటీరియల్ పుస్తకాల, వివరాలను సిద్ధం చేసి ఎమ్మెల్యేకు అందజేయనున్నట్లు తెలిపారు.

గోదావరి హారతికి సర్వం సన్నద్ధం

మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో క్షేత్రంలో మెరుగైన పారిశుధ్యం

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ప్రతి ఏట కార్తీకమాసంలో నిర్వహించే గోదావరి హారతి కార్యక్రమం ఈ ఏడాది కూడా కన్నుల పండుగగా నిర్వ హించనున్నారు. ఈ మేరకు రేపు సాయంత్రం జరగనున్న కార్యక్రమానికి కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆర్డీవో వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. దీనికి సంబంధించి విఐపి పాసులను పంపిణీ చేశారు. తిరుమల తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, పద్మావతిల ఉత్సవ విగ్రహాలను కొవ్వూరు తీసుకువచ్చి క్షేత్రంలో గల గోదావరిలో పెద్ద సైజు పంటును ఏర్పాటుచేసి ఆవేదికపై ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కొవ్వూరు పట్టణ వాసులే కాక పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి హారతి కార్యక్రమాన్ని చూసి తరిస్తారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో క్షేత్రంలో పారిశు ధ్య పనులు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. సానిటరీ సూపర్వైజర్ రవికుమార్, మేస్త్రి అప్పారావుల నేతృత్వంలో పారిశుద్ధ కార్మికులు రెండు టీములుగా ఏర్పడి ఉదయం నుండి రాత్రి వరకు ప్రత్యేక శ్రద్ధతో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరి హారతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు, అనధికారులు, హాజరుకాను న్నారు. డి.ఎస్.పి దేవకుమార్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ పీ. విశ్వం తన సిబ్బందిచే బందోబస్తు నిర్వహించనున్నారు.

క్షేత్ర స్థాయి నుంచే విద్యార్థులను ఉత్తేజ పరచాలి

- అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ ఎమ్ అమల కుమారి
- పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పై ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర - సీతానగరం: క్షేత్ర స్థాయి నుంచే విద్యార్థులను ఉత్తేజ పరిచే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అసిస్టెంట్ కమిష నర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎమ్ అమల కుమారి అన్నారు. మండలంలో గల ఐదు పదవ తరగతి పరీక్షా కేంద్రాలను మండల విద్యాధికారి స్వామి నాయక్ ఆధ్వర్యంలో ఏసీఓ అమల కుమారి క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అమల కుమారి విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచి తంగా అన్ని సదుపాయాలను కల్పిస్తుందన్నారు. విద్యార్థులను క్షేత్రస్థాయి నుంచే ఉత్తేజపరిస్తే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు న్నారు. గత సంవత్సరం మండలం నుండి కొన్ని ఫిర్యాదులు అందడంతో పరీక్షలు జరిగే ఐదు కేంద్రాలలో గల మౌలిక సదుపాయాలను అనగా బెంచీలు ఆర్వో వాటర్ ప్లాంట్, కాంపౌండ్ వాల్ వంటి వాటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రేడుల క్రింద విభజించి సి,డి గ్రేడుల విద్యార్థులను ప్రత్యేక శ్రద్ధ చూపించడం జరుగుతుం దని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థు లకు సూచించారు. ఉపాధ్యాయుల సైతం విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించడంలో తమ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎమ్ వీరభద్రరావు, సూపరిండెంట్ ఏ వి ఉమా మహేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

- జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్

విశాలాంధ్ర-తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో నవంబర్ 15వ తేదీ (శనివారం) ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్ చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జీ. మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రాజేంద్ర ఎనర్జీ పవర్ సొల్యూషన్, వారహి పవర్ సొల్యూషన్ తదితర సంస్థలలోని పలు ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించను న్నారని తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ పూర్తిచేసిన, అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుండి 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్ మరియు ఎంప్లాయిమెంట్ పోర్టల్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ కార్డు, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జీ. మురళి తెలిపారు.

ఓఎన్‌జీసీ స్థలాలు పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర-మామిడికుదురు : మండల పరిధిలో నగరం, గెద్దాడ, పాశర్లపూడి గ్రామాలలో ఓఎన్‌జిసి అద్దె స్థలాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మెటీరియల్ స్టోర్స్ మరియు ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ కేంద్రాల ఏర్పాటు కొరకు ప్రాథమిక పరిశీలన చేసినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారిని కె మాధవి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిధిలో నగరం, గెద్దాడ, పాశర్ల పూడి గ్రామాలలో రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో కలిసి ఆర్డిఓ, తాహసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సర్వేయర్లు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులు మెటీరియల్ స్టోర్ కొరకు స్థలాన్ని పరిశీలించి నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఈపీ డీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ బి రాజేశ్వరి, తాహసిల్దార్ సునీల్ కుమార్, నగరం విద్యుత్ సబ్ స్టేషన్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ఇంజనీర్ వై వెంకటేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - మండపేట : సీసీ రోడ్లు డ్రెయిన్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. రాయవరం మండలం, మాచవరం గ్రామంలో ఎంజి ఎన్ ఆర్ ఇ జి యస్ నిధులు సుమారు రూ.90 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్లు, డ్రైన్ల పనులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యతతో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు మేడపాటి రవీంద్రరెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి, తీపర్తి శ్రీరమేష్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కోడి చిన్న అప్పారావు, రొంగల సత్యనారాయణ, కర్రి వెంకట రెడ్డి, బత్తుల రామకృష్ణ, చింతలపూడి సతీష్, అధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయితీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మురళీ రాజు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : వైసీపీ అధినేత మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ప్రత్తిపాడు నియోజక వర్గ వైసీపీ నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి రాజు గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలపై చర్చించడంతో పాటు పార్టీలో ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారని తెలిసింది. వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న మురళి రాజును ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రాజకీయాలపై పలు ప్రశ్నలు వేశారని సమాచారం తెలిసింది.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-రాజోలు: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రాజోలు తహశీల్దార్ భాస్కర్ అన్నారు. రాజోలు మండలం కాటేనిపాడులో ప్రారంభమైన మూడో దశ రీ సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. రీసర్వే ద్వారా హద్దుల లోపాలు సరిచేయటం, రికార్డులు క్రమబద్దీ కరణ చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఏదు వంటి భూ సమస్యలు ఉన్నా పరిష్కరించుకోవాలని సూచించారు. మ్యుటేషన్ కూడా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమారి, వీఆర్వో బాలాజీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన

విశాలాంధ్ర-సామర్లకోట : సామర్లకోట పిఠాపురం రోడ్డులో గల ఆంధ్ర జుబ్లీ బాప్టిస్ట్ చర్చిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించి నట్లు సంఘ కాపరి రెవరెండ్ బివి రాజు, సంఘ అధ్యక్షులు బిఎస్ వందనంలు తెలిపారు. పిఠాపురం సిఎంసి ఆసుపత్రి సహకారంతో స్థానిక ఆంధ్ర జుబ్లీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించగా వైద్య శిబిరాన్ని సంఘ కాపరి బివి రాజు, సంఘ అధ్యక్షులు బీఎస్ వందనంలు ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మందికి సీఎంసీ వైద్యులు డాక్టర్ వై అమృత్ లాల్ కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని వ్యాధులకు పరీక్షలు నిర్వహించారని, ఆపరేషన్ అవస రమైన వారికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించనున్నట్లు డాక్టర్ అమృత్ లాల్ చెప్పారు. అవసరమైన వాళ్ళకి కళ్ళ జోళ్లను ఉచితంగా అందిం చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమ ంలో సీఎంసీ ఆసుపత్రి సిబ్బంది శ్రీవాసరావు, నాగమణి సేవలు అందించగా, ఆంధ్ర జుబ్లీ బాప్టిస్ట్ సంఘ నాయకులు టి సూర్యారావు, పిట్టా సత్యనారా యణ, ఐఈ జీవన్ కుమార్, బి జాన్ బాబు, పాస్టర్ రెవరెండ్ వి జాన్, టి రజినీ కాంత్, ఎ రాధాకృష్ణ, డేవిడ్ రాజు తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర-కాకినాడ : గురువారం కాకినాడ జిల్లా కొప్పవరం గ్రామంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయంలో, ముఖ్యమంత్రి సహాయ నిధిని వైద్యసహాయం కోసం దరఖాస్తు చేసిన లబ్ది దారులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాకినాడ జిల్లాకు చెందిన ఐదుగురు లబ్దిదారులకు మొత్తం రూ.9,91,602/-విలువైన సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీ చెక్కులను పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఆంధ్రప్రదేశ్‌లో అత్యవసర వైద్య సహాయానికి ప్రజలకు స్పష్టమైన భరోసా ఇస్తోంది. ముఖ్య మంత్రి చంద్ర బాబు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ నిధిని మరింత వేగంగా, పారదర్శకంగా అందుబాటు లోకి తీసుకువచ్చారు. ప్రతీ అవసరమైన వ్యక్తికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న నమ్మకాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ నిలబెడుతోంది అనీ వక్తలు అన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ అరిగేల శ్రీనివాస్ (బుజ్జి), ఆఫీస్ ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి, అవసరాల హరి, అజయ్, బాబ్జి పాల్గొన్నారు.

గ్రామోద్యోగ్ వికాస్ యోజనపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఆలమూరు : చేతి వృత్తి ద్వారా మహిళలు ఉపాధి పొందుతూ ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని ఏపీ కెవిఐసి డైరెక్టర్ డాక్టర్ ఎస్ గ్రీవ్ అన్నారు. మండలంలోని జొన్నాడ ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ చైర్మన్ ఏం రాజబాబు అధ్యక్షతన గ్రామోద్యోగ్ వికాస్ యోజన పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ రహమ్ తుల్లా, లీడ్ జిల్లా మేనేజర్ కేశవ వర్మ (యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా), జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఏపివి మాధవి హాజరయ్యారు. గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కొరకు గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నారని, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక, ఆదునికికరణ, శిక్షణ మెదలైన వాటిని అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం కెవిఐసి నోడల్ అధికారి డి సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ ఎన్ నాగమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్ల అంచనాతో ప్రతిపాదన

విశాలాంధ్ర - పెదపూడి : ఎంతో ప్రసిద్ధి చెందిన బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదన సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతిపాదనలు సిద్ధం చేయడం కోసం దేవాదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ సువిశాలమైన ఆలయ నిర్మాణంతో పాటు దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్న దానం, సాంస్కృతిక కార్యక్రమాలు, వసతి సదుపాయం కల్పి ంచే ఉద్దేశంతో ప్రతిపాదన చేయడం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ నిర్మా ణానికి ఒక ఎకరం గ్రామస్తులు సేకరించడం జరిగిందని మరో ఎకరా 30 సెంట్లు కోసం గ్రామస్తులు విరాళాలు సేకరిస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి చెప్పారు.

అన్న ప్రసాద వితరణ పుణ్యఫలం : డాక్టర్ చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : అన్న ప్రసాద వితరణ పుణ్యఫలమని శ్రేష్టమైన దని హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు, రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎండోమెంట్స్ ఆఫీస్ వద్ద గల వినాయకుని గుడి వద్ద రామదేవు దుర్గాప్రసాద్అలై బాల త్రిపుర సుందరి కుమార్తె చిరంజీవి లహరి డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం వచ్చిన సందర్భంగా తన మొదటి నెల జీతాన్ని అన్నప్రసాద వితరణకు వినియోగిం చారు. ఇటువంటి సేవా వితర ణకు కార్యక్రమాలు అందరూ అవగాహనతో ముందుకు వెళ్లాలని చిరం జీవి లహరిని డాక్టర్ చప్పిడి ఆశీర్వదించారు. సుమారు 200 మందికి అన్నప్రసాద్ వితరణ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సంస్థ సభ్యులు కిరణ్ కుమార్, రాజీవ్, మరియు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

G.B.R COLLEGE OF EDUCATION
ANAPARTHI, 533342. E.G. Dist
Admission Notification for B.Ed Spot and Management 2025 -26.
ELIGIBILITY : Any Bachelor's Degree with 50% Marks for OC, and 40% Marks for BC, SC, and ST in Aggregate, with or without EDCET- 2025.

Total intake	:	50 + 5 (EWS).
CAT A Vacancy seats	:	12 + 4 (EWS)
CAT B vacancy seats	:	17
Registration fee	:	200/-
College Status	:	Non-Minority.

Applications are invited and attend along with originals on or before 15-11-2025.
Contact : 9491518474 T.Adireddy (Kondababu)
Date: 13 -11-2025 Secretary & Correspondent

SRI KSHANA MUKTESWARA COLLEGE OF EDUCATION
MUKTESWARAM, 533211, INAVILLI (M), DR BR Ambedkar Konaseema Dt.
Admission Notification for B.Ed Spot and Management 2025 -26.
ELIGIBILITY : Any Bachelor's Degree with 50% Marks for OC and 40% Marks for BC, SC, and ST in Aggregate, with or without EDCET- 2025.

Total intake	:	50 + 5 (EWS).
CAT A Vacancy seats	:	7 (Including EWS)
CAT B vacancy seats	:	12
Registration fee	:	200/-
College Status	:	Non-Minority.

Applications are invited and attend along with originals on or before 15-11-2025.
Contact : 9849199215 Secretay & Correspondent

ఘనంగా ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో లొల్ల లాకుల వద్ద నవంబర్ 8న కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లి కుటుంబ సభ్యుల ఆరవ వార్షికోత్సవ ఆత్మీయ కలయిక విశేషంగా జరిగింది. రెండు రాష్ట్రాల నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు పాల్గొన దంతో కార్యక్రమం సందడిగా సాగింది. 2017లో వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రారంభ మైన కొల్లి కుటుంబ సమూహం, గురువారం కుటుంబ అనుబంధాలను బలపరిచే వేదికగా అభివృద్ధి చెందిందని సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ బంధాలు మరింత బలపడేలా ప్రతి సంవత్సరం ఈ కలయికను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలాజీ కొల్లి మాట్లాడుతూ-ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆటపాటలు, పిల్లల నృత్యాలు, పరిచయాలు, ప్రేమాభిమానాల విందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్దలకు సత్కారం నిర్వహించగా, ప్రతి కుటుంబానికి 6వ వార్షికోత్సవ జ్ఞాపికలు అందజేశారు. కొల్లి వెంకటేశ్వర్లు, కొల్లి శ్యామ్, కొల్లి ప్రతాప్, కొల్లి నాగేశ్వరరావు, కొల్లి పోసిబాబు, కొల్లి సుందరం, కొల్లి విశ్వనాథం, కొల్లి కృపావరం, కొల్లి వరప్రసాద్, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ కలయికతో లొల్ల లాకులగల ప్రాంతం ఉత్సాహభరితంగా మారింది. కుటుంబ సభ్యులు ఆనందంగా, స్నేహభావంతో గడిపారు.

ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, నరేంద్రపురం గ్రామ కాపురస్తులైన కర్రి నరసింహారావు, తండ్రి కర్రి అరవాలు అను వ్యక్తి తన భూమికి సంబంధించిన తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలం, నరేంద్రపురం గ్రామం తాలూకు రీ.స.నం.180/1లో 0.53 సెంట్లు వ్యవసాయ భూమికి సంబంధించిన డాక్యుమెంట్ నెం. 590/1984వ తేది. 23-04-1984వ తేదీగా గల ఒరిజినల్ దస్తావేజు ది.09-10-2025వ తేదిన నరేంద్రపురం నుండి రాజానగరం మోటార్ సైకిల్ పై వచ్చుచుండగా మార్గమధ్యంలో పడిపోయినది. వాటిని ఎంత వెతికిన దొరికి యుండలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయవలసిన విజ్ఞప్తి.

కర్రి నరసింహారావు, సెల్: 9573644777

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టు, కాకినాడ
D.O.P. No.115/2025

Between:
పసుపులేటి అనిత ...పిటిషనర్
మరియు
పసుపులేటి శ్రీను ...రెస్పాండెంట్
టు:
పసుపులేటి శ్రీను, S/o. శేషారావు, 45 సం॥లు, క్రిస్టియన్, ఎలక్ట్రికల్ వర్క్స్, R/o. డో.నెం.4-16/1, రాజీవ్‌గాంధీ నగర్, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భార్య అయిన మీపై విడాకులు కోరుతూ పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టువారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించినను మీరు తీసుకొనక దాటవేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.24-11-2025 తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 నిలకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ ప్లీడరు ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

కడియాల V.V.S.N.మూర్తి, A.భవాని, B.రాంబాబు, K.హిమబిందు, అడ్వకేట్లు
డో.నెం.52-1-66/1, అన్నమ్మఘాటి సెంటర్ నరసన్నరోడ్డు, జగన్నాధపురం కాకినాడ, సెల్: 9949394515

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

- దళితులకు వైసీపీ అన్యాయం చేసింది
- పార్టీ కమిటీల ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే ఆనందరావు

విశాలాంధ్ర-అమలాపురం : వైసీపీ పార్టీని నమ్ముకుని ఎక్కువ మంది దళితులు ఆ పార్టీకి ఓటు వేశారని వారికి వారు పూర్తిగా అన్యాయం చేసారని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు అన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం దళితులకు ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. అమలాపురం మెట్ల రమణబాబు స్వగృహం వద్ద అమలాపురం పట్టణ తెలుగు దేశం పార్టీ కమిటీల ప్రమాణస్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ బాధ్యతతో అందరూ సమిష్టిగా పని చేసి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికలు అన్నింటిలో టీడీపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎంతో కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే వివరించి ప్రమాణ స్వీకారం చేయించి వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి బాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు శెట్టి బత్తుల దిన్నబాబు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, యూనిట్, బూత్ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-అమలాపురం రూరల్ : శ్రీ లక్ష్మీ శ్రీనివాస కూచిపూడి నృత్యాలయం రాజమహేంద్రవరం కొసిరెడ్డి రమేష్ నాయుడు రమ్య నాయుడు శిష్య బృందంచే శ్రీశైలం దేవస్థానం శ్రీ మల్లికార్జున భ్రమరాంబికాదేవి ఆలయం నందు కార్తీక మాస ఉత్సవాలు సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాజమండ్రి, అమలాపురంకి చెందిన శిష్య బృందం పాల్గొని తమ నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకం చేసిన కౌన్సిలర్ మహాలక్ష్మి

విశాలాంధ్ర - మండపేట : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండపేటలో ఉత్సాహంగా కొనసాగుతోంది. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతోంది. మండపేట నియోజకవర్గంలో రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో పార్టీ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో వైసీపీ కౌన్సిలర్లు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు ప్రతీ ఇంటిని సందర్శించి ప్రజలు, విద్యార్థుల నుంచి ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కళాశాలలు కొనసాగాలని కోరుతూ సంతకాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి శిరంగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆ వార్డు కౌన్సిలర్ మలసాని సీతా మహాలక్ష్మి నివాసాన్ని సందర్శించారు. కార్యక్రమ ఉద్దేశ్యాన్ని ఆమెకు వివరించగా, సీతామహాలక్ష్మి ఏకీభవిస్తూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు టేకిముడి శ్రీనివాస్, యాండ్ర ప్రభాకరరావు, జొన్నపల్లి సత్తిబాబు, వీరి కిరణ్ కుమార్ గౌడ్, పలివెల ప్రసాద్, చిన్న, జి మహేష్, వంశీ, ఫణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు, టి రాయవరం, ఒమ్మంగి గ్రామాల్లో వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరి బాబు పర్యటించారు. ఇటీవల కాలంలో మరణించిన కుటుంబాలను గిరిబాబు పరామర్శించి ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా ధైర్యంగా ఉంటానని హామీ ఇచ్చారు. గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామిశెట్టి నాని, మదినే నూకరాజు, దాడిశెట్టి నూకపతి, గుడాల వెంకటరత్నం, బత్తుల నాగార్జున, శేరు కృష్ణ, కొండి శ్రీను, కొప్పన గంగారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు గృహ నిర్మాణాలు నిర్మించడమే ధ్యేయం

భాగంగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు చేతుల మీదుగా గృహ ప్రవేశాల వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురారి గ్రామానికి

విశాలాంధ్ర - గండేపల్లి : కూటమి ప్రభుత్వం ప్రతి అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ పనులను చేపట్టడమే ధ్యేయంగా పనిచేస్తుందని మండల పార్టీ అధ్యక్షులు మరియు కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్‌రావు యువ నాయకుడు జాస్తి వసంత్ అన్నారు. గురువారం గండేపల్లి మండలం మండలం మురారి గ్రామ సచివాలయం ఆవరణలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహప్రవేశాలు నిర్వహించిన కార్యక్రమంలో చెందిన నీలి కనకలక్ష్మి కుటుంబానికి తాళాలు, నూతన గృహ నిర్మాణం మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గండేపల్లి మండలంలో 166 గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయని నియోజకవర్గ వ్యాప్తంగా 660 మంది లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని వారందరికీ జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో తాళాలు అందచేయడం జరుగుతుంద న్నారు. అన్న నందమూరి తారక రామారావు కూడా గుడ్డ నీడ నినాదంతో టిడిపి పార్టీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాదిగా ఇల్లు మంజూరు చేయడం జరిగిందని అనంతరం చంద్రబాబు 16 సంవత్సరాల ముఖ్య మంత్రిగా కొన్ని లక్షల ఇల్లు కట్టించి ఇచ్చారని మళ్లీ కూటమి ప్రభుత్వం తర్వాత ఇల్లు నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందని ఆ నిర్మాణాలు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, మల్లేపల్లి సొసైటీ చైర్మన్ దిడ్డి చిన్న శ్రీను, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల రామాంజనేయులు, మురారి సొసైటీ చైర్మన్ చావా చౌదరి, గద్దె అబ్బిన్న, ఉండవల్లి బుల్లయ్య, జాస్తి రాధాకృష్ణ, చంద్రాల పెద్ద వెంకన్న ఆత్మారి రాము, గండేపల్లిఎండిఓ, హౌసింగ్ ఏఇ పి మణికంఠ, బిజెపి నాయకులు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ రాయుడు వారి పాలెం సచివాలయం పరిధిలో తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన ముమ్మిడివరం తహసిల్దార్ సుభాష్, వీఆర్వో మోహన్‌రావు ముమ్మిడివరం నగర పంచాయతీ రాయుడివారిపాలెం సచివాలయం పరిధిలో తుఫాన్‌లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు బియ్యం నిత్యవసర సరుకులు ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కేజీ నూనె, ఒక కేజీ కందిపప్పు, ఒక కేజీ పంచదార, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు రేషన్ డీలర్ మాదాల త్రిమూర్తులు షాప్ నెంబర్ 18లో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు, క్రాప చింతలపూడి 15వ వార్డు కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగ కుమారి బుజ్జి, సరిపెల్ల శ్రీను, మాదాల బుజ్జి, ఏడిద శివ సత్యనారాయణ, చింతలపూడి బాబురావు, గోరింట శ్రీను రాజు, శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములు నేటి నుండి ప్రారంభం కానున్నాయని, పిఠాపురం శాఖ గ్రంథాలయ అధికారి రేపాక వెంకటరాము తెలిపారు. ఈ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను 14వ వార్డు కౌన్సిలర్ నల్లా రవణమ్మ, మరియు మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి రామారావు చేతుల మీదుగా ప్రారంభం కానున్నట్టు ఆయన తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధులు వేషధారణ పోటీ, 15వ తేదీ వ్యాసరచన పోటీలు 16వ తేదీ వక్తృత్వ పోటీలు, 17వ తేదీ చిత్రలేఖన పోటీలు, 18వ తేదీ దేశభక్తి గేయాలు పోటీలు, 19వ తేదీ రంగవల్లులు పోటీలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ వారోత్సవాల్లో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరుగుతుందని కావున పట్టణంలో గల వివిధ పాఠశాలల విద్యార్థులందరూ ఈ పోటీలకు హాజరై బహుమతులు గెలుపొందాలని గ్రంథాలయ అధికారి తెలియజేశారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- ఎంఆర్‌పిఎస్ పిలుపు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 17వ తేదీన ఢిల్లీలో జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి, డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం, ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెం గ్రామంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ అధ్యక్షతన నిర్వహించబడింది. జిల్లా ఇంచార్జ్ కెబి సామ్రాట్ మధు మాదిగ, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మరియు జిల్లా కో-ఇంచార్జ్ దాన్ సూరి మాదిగ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దాన్ సూరి మాదిగ, ఎంఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి దూళి జయరాజు మాదిగ మాట్లాడుతూజస్టిస్ గావాయ్‌పై దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను ఇంకా అరెస్ట్ చేయకపోవడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని అన్నారు. దేశంలోని దళితులపై ఎక్కడ అన్యాయం జరిగినా నడిరోడ్డుపైకి దిగే ఏకైక ఉద్యమ సంస్థ ఎంఆర్‌పిఎస్ అని వారు స్పష్టం చేశారు. దేశ ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని దళిత సమాజంపై జరిగిన దాడిగానే ఎంఆర్‌పిఎస్ భావిస్తున్నదని నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న 17వ తేదీ ఢిల్లీ మాదిగల మహా సమావేశానికి పెద్ద ఎత్తున మాదిగలు వచ్చి పాల్గొని తమ ఐక్యత, బలం నిరూపించాలని పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమానికి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు, ఎంఆర్‌పిఎస్ అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్, నియోజకవర్గ ఇంచార్జి కాప నాగరాజు, ఎంఎస్‌పి కోశాధికారి ఏలీయా, కముజు శ్రీను, కొమ్ము నారాయుడు, మంద రామకృష్ణ, యార్లగడ్డ చంటి, పోసుపో రాజు, గద్దర్ అన్న, మీరా సాహెబ్, నేకూరి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అంగర పంచాయతీలో ట్రాక్టర్ ట్రక్కు మాయం

- కళ్ళుమూసుకుని పనిచేస్తున్న పంచాయతీ సిబ్బంది
- పంచాయతీ తీరుపై గ్రామస్తులు ఆగ్రహం

విశాలాంధ్ర - కాకినాడ : డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వర పురం మండలం అంగర గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ట్రక్కు మాయమైయింది. గ్రామంలో రోడ్లు తడిపేందుకు, అలాగే డ్రైనేజీలో ఉన్న షీల్ట్ తీయడానికి, గతంలో ట్యాంక్ నిర్మాణంతో కూడిన ట్రక్కును గ్రామంలో ఉపయోగించేవారు. గత కొంత కాలం నుండి ఈ ట్రక్కు దుర్గమ్మ గుడి వీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో దీనిని ఉంచారు. గ్రామంలో కొంత మంది వారి స్వప్రయోజనాలకు కూడా ఈ ట్రక్కునే ఉపయోగించుకునేవారు. ట్రక్కుమాయమై సుమారు 4 మాసాలైన ఇక్కడ లేదనే విషయాన్ని పంచాయతీ సిబ్బందికి తెలియక పోవడం శోచనీయం. ప్రజా ధనముతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి గ్రామ ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి వస్తువులు మాయమవుతున్నా పంచాయతీ అధికారులు కళ్ళుమూసుకుని వ్యవహరిస్తున్న తీరు దారుణ ంగా కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం ఈ విషయం కార్యదర్శి రాయుడు మోహన్ దృష్టికి రావడంతో అంగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. గతంలో ఈ పంచాయతీలో పని చేసిన కార్యదర్శులు రికార్డులు పూర్తి స్థాయిలో అప్పగించడం లేదని తెలుస్తోంది. అంతే కాకు ండా కార్యాలయానికి సంబంధించిన ఫర్నిచర్ కూడా గల్లంతైనట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నత అధికారులు దృష్టి పెట్టి పంచాయతీ ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయ ఆరోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - కరప : కరప మండలంలోని వేలంగి, కరప గ్రామాలలో ఉన్న శాఖ గ్రంథాలయాలలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పోట్నీడి వెంకటరంగయ్య పేర్కొన్నారు. ఈ వారోత్సవాలను ఈనెల 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదో తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు గ్రూపుల వారీగా వ్యాసరచన చిత్రలేఖన క్విజ్ వంటి పోటీలో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం : జిల్లాలో ప్రజల భద్రతే ధ్యేయంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఏ విధమైన లోటుపాట్లకు ఎట్టి పరిస్థితుల్లో తావీరాదని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, చేపట్టవలసిన చర్యలు, అక్రమణాల తొలగింపు, ఐరాడ్ వెబ్సైట్లో యాక్సిడెంట్ డెత్ కేసులు నమోదు, తదితర అంశాలపై పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఎన్ హెచ్, రవాణా శాఖల అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. తొలుత భీమవరం పట్టణంలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, తీసుకోవలసిన చర్యలపై భీమవరం డిఎస్పి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ప్రధానంగా డిఎన్ఆర్ కాలేజ్ రోడ్డు, టౌన్ హాల్ రోడ్డు, ఆర్టీసీ డిపో వద్ద బైపాస్ రోడ్డు మూడు రోడ్లు నిర్మాణంలో ఉండటం కారణంగా పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందని తెలిపారు. మొత్తం ట్రాఫిక్ అంతా భీమవరం ప్రధాన రహదారుల నుండే వెళ్లవలసి వస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవని, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు చేపట్టవలసిన చర్యలలో ఎట్టి పరిస్థితిలో రాజీ పడవద్దని పోలీస్ అధికారులను ఆదేశించారు. చిన్న చిన్న మార్పులతో రహదారుల భద్రత పెంచవచ్చని సూచించారు. ప్రస్తుతం భీమవరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న మూడు రోడ్లను డిసెంబర్ 15 నాటికి కచ్చితంగా పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. త్రిబుల్ రైడింగ్, నో హెల్మెట్, ట్రక్కులు ఓవర్ స్పీడ్ కచ్చితంగా నియంత్రించడంతోపాటు, ఫైన్ లు కూడా వేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాలతో పాటు, హైవేలలో కూడా రోడ్డు మార్జిన్లలో వివిధ రకాల షాపులు ఎప్పటి వలన ట్రాఫిక్ అంతరాయం, రవాణా భద్రతకు విఘాతం కల్పిస్తున్నాయని వీటిని కూడా కచ్చితంగా తొలగించాల్సిందేనని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జిల్లాలో జనవరి నుండి నవంబర్ వరకు జరిగిన రోడ్డు యాక్సిడెంట్లు, తదితర వివరాలను సమావేశంలో వివరించారు. రోడ్డు భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి టీం వర్క్గా పని చేయాలని సూచించారు. సమావేశంలో భీమవరం డివిజన్ డిఎస్పీ ఆర్.జయసూర్య, తాడేపల్లిగూడెం డివిజన్ డీఎస్పీ డి.విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్.ఇ శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఎస్ఎండి కృష్ణారావు, 216 నేషనల్ హైవే పిడి బి.శ్రీనివాస్, ఆర్ అండ్ బి 165 హైవే డిఈ ఎన్.శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ కళ్యాణ చక్రవర్తి, తహసీల్దార్ రావి రాంబాబు, జిల్లాలోని ఇతర ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నూతన అధ్యక్షులుగా బాబు, ప్రధాన కార్యదర్శిగా డాంగే ఎన్నిక



తొర్లపాటి బాబు, ఆర్. శ్రీనివాస్ డాంగే

విశాలాంధ్ర-ఏలూరు: ఏఐటీయూసీ జిల్లా విస్తృత సమావేశాలు సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా తొర్లపాటి బాబు,ఆర్ శ్రీని వాస్ డాంగేలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. గురువారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు చేయడం జరిగిందని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ పరి రక్షణ దినంగా కార్మిక, రైతు,వ్యవసాయ కార్మిక తదితర ప్రజాసంఘాల ఆధ్వ ర్యంలో జరిగే కార్యక్రమాల్లో ఏఐటీయూసీ కార్మికులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్లు రద్దుచేసి,పాత కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన 10 గంటల పని రద్దు చేయాలని,భవన నిర్మాణం కార్మికుల పెండింగ్ క్లైములను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ, ముఠా హమాలి కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగ గుర్తించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాబోయే కాలంలో ఏలూరు జిల్లాలో బలమైన కార్మిక ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు.

ఆనూరు దళిత పేటకు మౌలిక వసతులు కల్పించాలి

అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కర్నాకుల డిమాండ్

విశాలాంధ్ర-పెద్దాపురం : నవంబర్ మాసమంతా విప్లవ అమరవీరుల వారోత్సవాలు భాగంగా పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో గురువారం రైతు కూలీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఎంతో పోరాటం చేసి, ఎన్నో కేసులు అనుభవించి, ఆనూరు దళితులకు ఇక్కడ ఇళ్ల స్థలాలుగా పంచిపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అప్పటి నుంచి ఈ పేటకు మౌలిక వసతులు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు వినతి పత్రాలు అందించడం జరిగింది. అధికారులు నిమ్మకు నీరెత్తునట్టు వ్యవహరిస్తున్నారే తప్ప స్పందించిన పాపను పోలేదని ఆయన విమర్శించారు. రాజకీయ నాయకులు అయితే దళితుల అభివృద్ధి మా ధ్యేయమని అధికారం చేపట్టిన తర్వాత ఎక్కడా కనబడడం లేదని ఆయన అన్నారు. ప్రధానంగా ఇక్కడ సుమారు 120 కుటుంబాలు నివాసం ఉంటున్నారని, ఇంకా 40 మందికి పట్టాలు మంజూరు చేయలేదని అవి వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం వారు స్పందించి ఇల్లు కట్టుకోవడానికి దళితులకు లోన్లు (6 లక్షలు చొప్పున) ఇవ్వాలని, అలాగే సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు మొదలగు మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీడియస్యు (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కే సతీష్, గ్రామ నాయకులు పైడిమళ్ల నాగరాజు, ఏసన్న, పైడిమళ్ల దయ, మల్లమ్మ, మిరియ్యమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన

విశాలాంధ్ర-గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనకు మురారి, గండేపల్లి, మల్లేపల్లి, పరిసర గ్రామాల్లో ప్రజలు, ఆర్యవైశ్య సంఘము సభ్యులు పెద్దలు, పిల్లలు, మహిళలు అందరూ కుటుంబ సమేతంగా వచ్చి ఉసిరి మొక్క వద్ద పూజలు నిర్వహించుకుని, ఆట పాటలతో ఆనందంగా గడిపి భోజనాలు చేశారు.ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), స్టేట్ ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ మండవిల్లి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మానేపల్లి బంగార్రాజు, గండేపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త చిన్న వీర బద్రరావు(శివ) ముఖ్య అతిథిలుగా విచ్చేసారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య సంఘం కార్యవర్గ సభ్యులు సాయి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సపక్ తక్ర జాతీయస్థాయి పోటీలకు ఆశ్రిత ఎంపిక

విశాలాంధ్ర-గోపాలపురం : సపకతక్ర జాతీయ స్థాయి పోటీలకు వాదలకుంట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఆశ్రిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ తెలిపారు. గురువారం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ అండర్ 14 విభాగంలో ఈ నెల 2,3 తేదీలలో అనంతపురం జిల్లా ఉరవకొండ లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తరపున వాదాలకుంట జిల్లా పరిషత్ హై స్కూల్ కీ చెందిన ఆశ్రిత, రితిక, దక్షిత, మరియు అఖిల్ పాల్గొనగా అండర్ 14 భాగములో జిల్లా తరపున సిల్వర్ మెడల్ సాధించారు. సిల్వర్ మెడలు సాధించడంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని అయినా ఆశ్రిత డిసెంబర్ నెలలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు హెచ్ఎమ్ విజయ్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన ఆశ్రితను వ్యాయామ ఉపాధ్యాయులు ఓం ఫణి, ఉపాధ్యాయులు జగదీష్, సురేష్,ఎస్ఎంసి చైర్మన్ నాగలక్ష్మి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉద్యోగ మార్గదర్శకాలుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయం లోని ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగ మార్గదర్శకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ టెక్ వ్యవస్థాపకుడు మరియు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వినీతేజ మరియు విజన్ టెక్ డైరెక్టర్ అంజన్ కుమార్ ముఖ్య అతిథులుగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఇన్ ఫార్మస్యూటికల్స్, మెడికల్ కోడింగ్, ఫార్మకోవిజిలెన్స్, క్లినికల్ సాస్ ప్రోగ్రామింగ్ల గురించి అతిథులు విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడం వలన విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకులు ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఇన్ ఫార్మస్యూటికల్స్, మెడికల్ కోడింగ్, ఫార్మకోవిజిలెన్స్, క్లినికల్ సాస్ ప్రోగ్రామింగ్ల గురించి దేశ, విదేశములలో గల ఉద్యోగ అవకాశములు గురించి అవగాహన పొందారు. అనంతరం అతిథులను ఆదిత్య యూనివర్సిటీ తరపున ఫార్మసీ కళాశాల డీన్ డా డి సతీష్ కుమార్ జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు.

రామునాయుడు మృతి సీపీఐ కి తీరని లోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐలో సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యుల స్థాయికి ఎదిగారని ఆయన పేర్కొన్నారు. కళలపై ఆసక్తితో మాకిరెడ్డి రామునాయుడు విశాఖ ప్రజానాట్యమండలిలో చేరి, ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షునిగా పనిచేశారని తెలిపారు. ఉమ్మడి విశాఖజిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యునిగా పార్టీ కార్యకలాపాల్లో, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారని, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా సీపీఐ కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యులుగా కొనసాగుతున్న రామునాయుడు మరణం బాధాకరమని, పార్టీకి తీరని లోటన్నారు. రామునాయుడు మృతిపై ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

వ్యక్తిత్వ వికాసంపై సదస్సు

విశాలాంధ్ర -కాకినాడ : ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమాల్లో భాగంగా కరకుదురు విద్యార్థు లకు, గ్రామస్తులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవివిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కరకుదురు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం కార్యక్రమాలలో భాగంగా 6వ రోజు విద్యార్థులకు మరియు గ్రామస్తులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో భాగంగా ఇస్కాన్ స్వామీజీ అనంత శేష దాసు మాట్లాడుతూ విద్యార్థులకు మరియు గ్రామస్తులకు భగవద్గీత ద్వారా వ్యక్తిత్వ వికాస అంశాలను వివరించారు. సత్వ, రజో, తమో గుణాలను గురించి ప్రస్తావించారు. సత్వగుణ ప్రధానమైన ఆలోచనలు రావాలంటే సత్వగుణ సంబంధమైన పదార్థాలను తినాలన్నారు. దైనందిన జీవితంలో ఏకాగ్రత పెరగడానికి ధ్యానం తప్పనిసరి అని చెప్పారు. భగవద్గీత శ్లోకాలను విద్యార్థులకు తెలియజేసి వాటి వివరణను ఇచ్చారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పాటించాలని పిలుపునిచ్చారు. ఉన్నత వ్యక్తిత్వం కలిగి ఉండాలని అన్నారు. ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుధాకర్, యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వి సత్యనారాయణ అభినందించారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు గ్రామపెద్దలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, డి అశ్విని, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.